నేడు పోతులూరి బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో యజ్ఞం

ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ భవానీనగర్ శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో విశ్వకర్మ యజ్ఞమ హోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటలకు శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో యజ్ఞ, హోమ కార్యక్రమాలు మధ్యాహ్నం 1 గంటలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు విశ్వసృష్టికర్త విశ్వకర్మ భగవానుని ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు భక్తులు అధిక సంఖ్యలో హాజరై దర్శించుకోవాలని తెలిపారు. *– బాలానగర్, సెప్టెంబర్ 16*

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 16: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై సుమన్ తెలిపిన ప్రకారం.. నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం, ఇంద్రానగర్‌కు చెందిన ఎం.శ్రవన్‌కుమార్ నగరంలోని కేపీహెచ్‌బీ కాలనీలో ప్రైవేట్ హాస్టల్‌లో నివసిస్తూ.. ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం స్నేహితుడు జి.రాఘవేందర్‌రావు బైక్‌పై వెనుక కూర్చున్న శ్రావన్‌కుమార్ కేపీహెచ్‌బీ కాలనీ మొదటి రోడ్డులో వెళుతున్నారు. ఈ క్రమంలో మరోబైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు ముందుగా వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టారు. దీంతో ముందు బైక్‌పై వెళ్తున్న రాఘవేందర్‌రావుకు స్వల్ప గాయాలు కాగా.. శ్రావన్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతున్నారు. శ్రవన్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉన్నది. అతడి సోదరుడి ఫిర్యాదు మేరకు ముగ్గురు వ్యక్తులతో బైక్‌ను నడిపి బైక్‌ను ఢీకొట్టిన మహీంద్ర ఆదిత్యనాథ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ తల్లి కంటే రాజీవ్ విగ్రహం ముఖ్యమా?

మియాపూర్, సెప్టెంబర్ 16: తెలంగాణ తల్లి విగ్రహం కంటే రాజీవ్ గాంధీ విగ్రహం ఎంత వరకు ముఖ్యమో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించుకోవాలని భాజాపా మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి బొల్లేపల్లి సీతారామరాజు ప్రశ్నించారు. ఎంతో మంది బలిదానాల వల్ల తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, ఈ తెలంగాణ రాష్ట్రంలో అందరి దేవత ముమ్మాటికీ తెలంగాణ తల్లే నన్నారు. ఆమె విగ్రహం ఏర్పాటు చేయకుండా, రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడం విడ్డూరంగా ఉందని, సీఎం రేవంత్‌రెడ్డి ఈ చర్య వల్ల ఆత్మబలిదానాలు చేసుకున్న వారి ఆత్మలు ఘోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఎప్పటికైనా తెలంగాణ దేవత తెలంగాణ తల్లేనని కాంగ్రెస్ పార్టీ గుర్తుంచుకోవాలని బొల్లేపల్లి స్పష్టం చేశారు.

బీజేపీ నాయకురాలు సుహాసినిశక్తి సస్పెండ్

దుండిగల్, సెప్టెంబర్ 16: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, బాచుపల్లికి చెందిన బీజేపీ నాయకురాలు సుహాసినిశక్తిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షులు డా.ఎస్.మల్లారెడ్డి సుహాసినిని పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. బాధ్యతారాహితంగా వ్యవహరించడంతోపాటు పార్టీకి నష్టం వాటిలేల్లా, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. కాగా, వినాయక నవరాత్రుల సందర్భంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని పలు వినాయకమండపాల వద్ద పూజలు నిర్వహించిన నేపథ్యంలో ఆయన తనను పట్టించుకోలేదని సుహాసిని పత్రికా ప్రకటనలు విడుదల చేసింది. దీంతో పార్టీ జిల్లా నాయకత్వం ఆమెపై సస్పెన్షన్ వేటు వేసింది. ఇక నుంచి ఆమెతో బీజేపీకి ఎటువంటి సంబంధంలేదని స్పష్టం చేశారు.

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 16 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో సోమవారం కూరగాయల ధరలు(కేజీ–రూపాయలు) ఇలా ఉన్నాయి. టమాట 31, వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 28, బజ్జి మిర్చి 60, కాకరకాయ 52, బీరకాయ 50, క్యాబేజి 17, ఫ్రెంచ్ బీన్స్ 65, క్యారెట్ 50, కాలీఫ్లవర్ 23, దొండ 45, చిక్కుడు 80, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 28, క్యాప్సికం 70, ఆలుగడ్డ 37, కీరా 31, దోసకాయ 18, సొరకాయ 19, పొట్లకాయ (1) 18, కందగడ్డ 65, ఉల్లిపొరక 35, కరివేపాకు 60గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

నిమజ్జన వేడుకలకు సర్వం సిద్ధం

కూకట్‌పల్లి జంట సర్కిళ్లలో..

- 4 చెరువులు.. 3 కొలనులలో ఏర్పాట్లు
- చెరువు పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు
- సీసీ కెమెరాలతో నిరంతర నిఘా
- 1.30 లక్షల వాటర్ ప్యాకెట్ల పంపిణీ సిద్ధం

రంగధాముని (ఐడీఎల్) చెరువుగట్టుపై కొనసాగుతున్న విగ్రహాల నిమజ్జనాలు

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 16 : కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలో వినాయక నిమజ్జన వేడుకలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేశారు. జీహెచ్ఎంసీ, పోలీస్, ట్రాఫిక్, రెవెన్యూ, జలమండలి, ఇరిగేషన్, విద్యుత్, ఇతర ప్రభుత్వ విభాగాల ఆధ్వర్యంలో ప్రధాన చెరువుల వద్ద నిమజ్జనాల కోసం ఏర్పాట్లు చేశారు. జంట సర్కిళ్లలోని కూకట్‌పల్లి రంగధాముని (ఐడీఎల్) చెరువు, సున్నం చెరువు, బోయిన్‌పల్లి హస్మత్‌పేట చెరువు, ఆల్విన్‌కాలనీ ప్రగతినగర్ చెరువులలో నిమజ్జనాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాలనీలు, బస్తీల నుంచి ప్రత్యేక వాహనాలలో ఊరేగింపుగా వచ్చే వాహనాలను క్రమపద్ధతిలో చెరువుగట్టుపైకి పంపించడం.. విగ్రహాలను పద్ధతిగా చెరువులలో నిమజ్జనం చేయడం కోసం పక్కాగా ఏర్పాటు చేశారు.

4 చెరువులు, 3 కొలనుల్లో..

కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్లలో 4 చెరువులు, 3 కొలనుల వద్ద నిమజ్జనాలకు ఏర్పాట్లు చేశారు. మూసాపేట రంగధాముని (ఐడీఎల్) చెరువుగట్టుపై 7 పెద్ద క్రేన్లు, 2 మొబైల్ క్రేన్లు, 3 ఇటాచీలు, 1 జేసీబీ, సున్నం చెరువు వద్ద 1 క్రేన్, బోయిన్‌పల్లి హస్మత్‌పేట చెరువు వద్ద 2 క్రేన్లు, 1 ఇటాచీ, 1 జేసీబీ, ప్రగతినగర్ చెరువు వద్ద 2 క్రేన్లు, 1 ఇటాచీ,1జేసీబీ అందుబాటులో ఉంచారు. సాధారణ విగ్రహాలను నిమజ్జనం చేయడానికి రంగధాముని, హస్మత్‌పేట, ప్రగతి నగర్ చెరువులలోని మూడు కొలనులను సిద్ధం చేశారు. అలాగే కూకట్‌పల్లి చిత్తారమ్మ దేవాలయ ప్రాంగణంలో మూడుఫీట్ల లోపు విగ్రహాలను నిమజ్జనం చేయడానికి పోర్టబుల్ ట్యాంక్ (రబ్బర్)ను సిద్ధం చేశారు. మరోవైపు చెరువుల వద్ద బారికేడ్లు, విద్యుత్‌దీపాలు, వివిధ విభాగాల అధికారుల సమన్వయం కోసం ఆయా చెరువుగట్లపై ప్రత్యేక క్యాంపు కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ఆయా చెరువులలో 24 గంటలపాటు విగ్రహాలు నిమజ్జనం చేసేలా యంత్రాగాన్ని సిద్ధంగా ఉంచారు. చెరువులు, కొలనులలో నిమజ్జనం చేసిన వినాయక విగ్రహాలు, పూజా వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

చెరువు పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు..

వినాయక విగ్రహాలు నిమజ్జనాలు జరిగే చెరువు పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. రంగధాముని (ఐడీఎల్) చెరువుగట్టుపై వాహనాల రాకపోకలను నిషేధించారు. కేపీహెచ్‌బీ కాలనీ నుంచి వచ్చే వాహనాలు మూసాపేట వైపు.. మూసాపేట నుంచి వచ్చే వాహనాలు కూకట్‌పల్లి వైపు మాత్రమే వెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు. ఐడీఎల్ చెరువుగట్టు పైకి వినాయక విగ్రహాలతో ఉన్న వాహనాలకు మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. నిమజ్జన వేడుకలను చూసేందుకు వచ్చే వాహనాలను కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెట్రో పార్కింగ్ పాయింట్‌లో, రెయింబో విస్తా పక్కన ఖాళీ స్థలంలో, ఐడీఎల్ చెరువు కింద గుర్తించిన ప్రాంతాల్లో వాహనాలను పార్కింగ్ చేయాలని కోరారు. అలాగే చెరువు పరిసరాలన్నీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాలను పరిశీలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ట్రాఫిక్ సీఐలు తెలిపారు.

1.30 లక్షల వాటర్ ప్యాకెట్ల పంపిణీ..

వినాయక నిమజ్జన వేడుకల సందర్భంగా కూకట్‌పల్లి జలమండలి పరిధిలో నాలుగు చెరువుల వద్ద తాగునీటిని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. రంగధాముని(ఐడీఎల్), ప్రగతినగర్, సున్నం, హస్మత్‌పేట చెరువులతో పాటు ముంబై జాతీయ రహదారిపై కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్‌స్టేషన్, కూకట్‌పల్లి బీజేసీ ఆఫీస్, అంబేద్కర్ వైజంక్షన్‌ల వద్ద 2 కేంద్రాల చొప్పున ఏర్పాటు చేసి.. 1.30 లక్షల వాటర్ ప్యాకెట్లను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. అలాగే ఆయా కేంద్రాల్లో డ్రమ్ములలో స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. 24 గంటలు భక్తులకు తాగునీటిని అందించేందుకు పక్కాగా ఏర్పాట్లు చేసినట్లు జలమండలి అధికారులు తెలిపారు.

నిజాంపేట్ కేటీఆర్ కాలనీలో కేఎస్ఆర్ టీమ్ సభ్యులు

నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలో...

కేపీహెచ్‌బీ కాలనీ: 3వ ఫేజ్‌లోని శ్రీలక్ష్మీ గణపతి ఫ్రెండ్స్ అసోసియన్ గణనాథుడి లడ్డూను రూ.2.59 లక్షలకు వేలం పాటలో కైవసం చేసుకున్న యర్రం అశోక్ రెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ:బాలాజీనగర్ డివిజన్ సైబర్ సిటీ మెరీనా స్కై కమ్యూనిటీలోని గణనాథుడి లడ్డూను రూ.3.30 లక్షలకు వేలం పాటలో కైవసం చేసుకున్న విశ్వనాథ రెడ్డి

లక్షలు పలికిన వినాయకుడి లడ్డూలు

మియాపూర్: మియాపూర్ డివిజన్ న్యూ ప్రశాంత్‌నగర్‌లో వేడుకలో లడ్డూ దక్కించుకున్న చక్రపాణిరెడ్డి, సునీతరెడ్డి, స్థానిక మహిళలు చిన్నారులు

దుండిగల్/కేపీహెచ్‌బీ కాలనీ/మియాపూర్/కొండాపూర్ , సెప్టెంబర్16: వినాయక నవరాత్రులు ముగియడంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వినాయక లడ్డూలు లక్షలు పలికాయి. ముందుగా ఆయా మండపాల వద్ద నిర్వహించిన లడ్డూల వేలం పాట నిర్వహించారు. నిజాంపేట్‌లోని కొలన్ తులసిరెడ్డి కాలనీ(కేటీఆర్)లో ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూను కాలనీ వ్యవస్థాపకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి టీమ్ సభ్యులు రూ.1,78,113లకు కైవసం చేసుకోగా, నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను కాలనీకి చెందిన అవినాశ్‌రెడ్డి చౌదరి రూ.1,71,116, స్వామివారి మెడలోని కాసుల హారాన్ని రూ.40,116లకు సూర్యనారాయణ దంపతులు దక్కించుకున్నారు. అదే విధంగా గాజులరామారం డివిజన్, దేవేందర్ నగర్‌లోని పోచమ్మ బస్తీలోని వినాయకుడి లడ్డూను మొదటి లడ్డూను ఖాజాభాయ్ రూ.30వేలకు, రెండో లడ్డూను సున్నం సాయికుమార్ రూ.21వేలకు దక్కించుకోగా, భాజాబజంత్రీలతో లడ్డూలను అందజేశారు. – మియాపూర్ డివిజన్ న్యూ ప్రశాంత్‌నగర్ కాలనీలో చక్రపాణిరెడ్డి సునీత దంపతులు రూ. 50వేలకు వినాయక లడ్డూను వేలం పాటలో దక్కించుకున్నారు.

కొండాపూర్ : కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ ఏ బ్లాక్ శ్రీ సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన గణపయ్య లడ్డూ వేలం పాటలో రూ. 3,16,116లకు దక్కించుకున్న శ్లోక చిట్ ఫండ్స్ ప్రొప్రైటర్ రాము పటేల్ మాధవి

కేపీహెచ్‌బీ కాలనీ:బాలాజీనగర్‌లో గణనాథుడి పూజలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శిలిష, మాజీ కార్పొరేటర్ బాబురావు, భక్తులు

మియాపూర్: మియాపూర్ డివిజన్‌లో వినాయకుడి పూజలలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

గాజులరామారం డివిజన్ పోచమ్మ బస్తీలో..

మియాపూర్: వివేకానందనగర్ డివిజన్‌లో పూజలో కార్పొరేటర్ మాధవరం రోజాదేవి

మియాపూర్ : ఆల్విన్ కాలనీ డివిజన్‌లో పూజలలో కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్

ఘనంగా గణపతి పూజలు

బాలానగర్/ కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 16 : గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు మండపాలలో భక్తుల పూజలందుకున్న గణనాథులు గంగమ్మ ఒడికి చేరుకున్నారు. సోమవారం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట బోయిన్ చెరువు కొలనులో ఏర్పాటు చేసిన నిమజ్జనం పాల్గొని పలువురు భక్తులు తాము ఏర్పాటు వినాయకులను పూజల అనంతరం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా గణనాథులను ఊరేగింపుగా తీసుకువచ్చి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

– కేపీహెచ్‌బీ కాలనీ: వివేకానందనగర్ డివిజన్, మియాపూర్ డివిజన్‌లో ఎమ్మెల్యే, పీఏసీ ఛైర్మన్ అరెకపూడి గాంధీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పూజలు చేసి అన్నదానంలో పాల్గొన్నారు. కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, దొడ్ల వెంకటేశ్ గౌడ్, మాధవరం రోజాదేవిరంగారావు, నార్నె శ్రీనివాస్‌రావులు తమ డివిజన్‌లలో వేడుకలలో పాల్గొని పూజలు చేశారు.

కేపీహెచ్‌బీ కాలనీ:బాలాజీనగర్‌లో గణనాథుడి పూజలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శిలిష, మాజీ కార్పొరేటర్ బాబురావు, భక్తులు

మియాపూర్: మియాపూర్ డివిజన్‌లో వినాయకుడి పూజలలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

బాలానగర్ : బాలానగర్‌లో గణపతిని దర్శించుకున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, భక్తులు

మియాపూర్ : ఆల్విన్ కాలనీ డివిజన్‌లో పూజలలో కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్

బాలానగర్: ఫిరోజ్‌గూడలో అన్న ప్రసాద వితరణలో పాల్గొన్న బాలానగర్ మాజీ కార్పొరేటర్ కాండూరి నరేంద్రాచార్య

బాలానగర్ : హస్మత్‌పేట చెరువు కొలనులో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

మియాపూర్ : డివిజన్‌లో పూజలలో బల్దియా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

బాలానగర్ : ఓల్డ్‌బోయిన్‌పల్లిలో బొజ్జగణపయ్యను దర్శించుకున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ తనయుడు మల్లికార్జున్ యాదవ్, భక్తులు తదితరులు

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

కేపీహెచ్‌బీ కాలనీ:కేపీహెచ్‌బీ కాలనీలో జరిగిన వేడుకలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొని ప్రత్యేక పార్థనలు చేసి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు గౌసుద్దీన్, బీఆర్ఎస్ నేతలు ఉన్నారు.

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ బండ ఖాజానగర్‌లో నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ వేడుకలలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ స్థానిక ముస్లిం ప్రతినిధులతో, పార్టీ నేతలతో కలిసి పాల్గొన్నారు. మైనార్టీలను ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో ఆయన పాల్గొన్నారు. *– మియాపూర్*

కేపీహెచ్‌బీ కాలనీ: హైదరాబాద్ సీపీగా బాధ్యతలు చేపట్టిన సీవీ ఆనంద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

గుర్రపు డెక్క తొలగింపు పనుల పర్యవేక్షణ

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుందరీకరణ పనులలో భాగంగా గుర్రపు డెక్క తొలగింపు, మురుగు నీరు చెరువులోకి రాకుండా నాలాల్లోకి మళ్లింపు, పరిశుభ్రమైన నీరు వచ్చేలా డైవర్షన్ ఛానెళ్ల నిర్మాణం, పటిష్టమైన వాకింగ్ ట్రాక్, పచ్చదనం వంటి వసతులను చేపడుతున్నట్లు తెలిపారు. *– మియాపూర్, సెప్టెంబర్ 16*

కుంగిన రోడ్డుకు మరమ్మతులు

పనులను పరిశీలించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మరమ్మతు పనులను కార్పొరేటర్లతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

కొండాపూర్, సెప్టెంబర్ 16: చందానగర్ డివిజన్ దీప్తిశ్రీనగర్ కాలనీలో కుంగిన రోడ్డు మరమ్మతు పనులను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథరెడ్డి, మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, జలమండలి అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరమ్మతు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిందిగా సూచించారు. మరోసారి సమస్య పునరావృతమవ్వకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఓపెన్ నాలాలోని నీరు యూజీడీ లైన్లలోకి రాకుండా మరమ్మతులు చేపట్టాలన్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి ప్రజల ఇబ్బందిని తొలగించాలన్నారు.

గాంధీని కలిసిన కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

దుండిగల్, సెప్టెంబర్ 16: పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడీ గాంధీని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి(కేఎస్ఆర్) సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఆయనతోపాటు నేతలు పంగా శ్రీనివాసరావు, ఫణి, ప్రసాద్, మౌలేశ్వరరావు, మహేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ నూతన కమిటీ ఎన్నిక

తెలంగాణ రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 16: తెలంగాణ రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా డీఆర్.బంగారిస్వామి ఎన్నికయ్యారు. సోమవారం కూకట్‌పల్లిలో తెలంగాణ రాష్ట్ర బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణారావు, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించి, పాత కమిటీని రద్దు చేసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా డీఆర్.స్వామి, ప్రధాన కార్యదర్శిగా వి.వెంకటరమణ, కోశాధికారిగా ఎం.చిన్నయ్య, ఉపాధ్యక్షులుగా దుర్గయ్య, రవీంద్రవర్మ, శ్రీకాంత్‌రెడ్డి, మనిమాధవి, సురేశ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా కమల్‌కుమార్, రవీంద్రకుమార్, బి.శ్యామ్, స్వామి గౌడ్, తిరుపతి, కవితలు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల పరిశీలకులుగా ఎం.శ్రీనివాస్‌రావు, అలెగ్జాండర్ ఫ్రాన్సీ, సతీశ్‌గౌడ్, పి.వెంకటరమణ, రిటర్నింగ్ అధికారిగా రోహిత్‌లు వ్యవహరించారు. సమావేశంలో వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

భీమయ్య సగర చిరస్మరణీయుడు

సగర జాతి అభివృద్ధికి వెలకట్టలేని సేవలందించిన గిన్నె భీమయ్య సగర చిరస్మరణీయుడని తెలంగాణ రాష్ట్ర సగర సంఘం అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర అన్నారు. ఇటీవల అకాల మరణం చెందిన గిన్నె భీమయ్య సంస్మరణ సభను సోమవారం గచ్చిబౌలిలోని రాష్ట్ర సగర సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భీమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సగర సంఘం రాష్ట్ర, జిల్లా, ప్రతినిధులు పాల్గొన్నారు. *– కొండాపూర్, సెప్టెంబర్ 16*

లాడ్జిలో ఉరేసుకొని నర్సు అనుమానాస్పద మృతి

శ్రుతి(ఫైల్)

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 16: గచ్చిబౌలిలోని ఓ లాడ్జ్‌లో నర్సు ఉరేసుకొని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్, గచ్చిబౌలి సీఐ ఆంజనేయులు తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జడ్చర్ల ప్రాంతానికి చెందిన గొల్ల వెంకటయ్య, స్వర్ణలత దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్దకూతురు శ్రుతి(23) నర్సింగ్‌కోర్సు పూర్తి చేసి నగరంలోని నార్సింగి అలోన్ హాస్పిటల్‌లో నర్సుగా పనిచేసింది. అనంతరం గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో నర్సుగా కొద్దిరోజుల కిందట విధుల్లో చేరింది. ఇటీవల శ్రుతి స్కూటీపై నుంచి కిందపడగా.. గాయాలు కావడంతో డ్యూటికి వెళ్లకుండా తల్లిదండ్రులతో జడ్చర్లలో ఉన్నది. కాగా, శనివారం 14వ తేదీన షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన స్నేహితురాలు మౌనికతో కలిసి శ్రుతి నగరానికి వచ్చింది. హైదరాబాద్‌కు మౌనికతో వెళ్తున్నానని, అలాగే హాస్పిటల్‌కు వెళ్లి తన జీతం తీసుకొని వస్తానని తల్లిదండ్రులకు చెప్పి వెళ్లింది. కాగా, శ్రుతి, మౌనిక, విద్యపోగు జీవన్‌పాల్, పిన్నెల్లి వెంకటేశ్‌లు నలుగురు స్నేహితులు శనివారం రాత్రి 8 గంటల సమయంలో నిమజ్జనం చూసేందుకు వచ్చామని చెప్పి నగరంలోని గచ్చిబౌలి చిన్నఅంజయ్యనగర్ రెడ్‌స్టోన్ లాడ్జిలో రెండు గదులు తీసుకున్నారు. లాడ్జిలోని 301 గదిలో శ్రుతి, జీవన్‌పాల్‌లు, 505లో మౌనికా, వెంకటేశ్‌లు ఉన్నారు. ఆదివారం సాయంత్రం నలుగురు కలిసి లాడ్జిలోని 301 గదిలో మద్యం సేవించారు. కాసేపటికి శ్రుతి తలనొప్పిగా ఉందని మిత్రులకు చెప్పి 505 గదిలో పడుకుంటానని వెళ్లగా, రాత్రి 9:30 గంటల సమయంలో సికింద్రాబాద్‌లో ఉంటున్న వెంకటేశ్ స్నేహితుడు కాలనీలో నిమజ్జనం చూసేందుకు వెళ్లేందుకు శ్రుతి గదికి వెళ్లి తలుపుతట్టారు. ఆమె తీయకపోవడంతో నిద్రపోతుందనుకుని మౌనిక, వెంకటేశ్, జీవన